సమ్మెపై పునరాలోచించండి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ భవిష్యత్ దృష్ట్యా సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈనెల 7నుంచి టీజీఎస్ ఆర్టీసీ సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం ఆయన స్పందించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని.. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితిలో ఆర్టీసీ లేదని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు. పెండింగ్ పీఎఫ్ బకాయిలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సమ్మెపై తనను ఇప్పటి వరకు ఎవరూ కలవలేదని, లేబర్ కమిషనర్‌కు మాత్రమే సమ్మె నోటీసు అందజేశారని వివరించారు. ఆర్టీసీ సంస్థ నిలబడాలని, 40వేల కుటుంబాలు బాగుపడాలని కోరుకునే ప్రభుత్వం తమదని పొన్నం తెలిపారు.

'సారథి' పోర్టల్ ప్రారంభం

సికింద్రాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా 'సారథి పోర్టల్'ను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలో వాహనదారులకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అందాల పోటీలను వ్యతిరేకించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహించడం అత్యంత బాధాకరమని.. పవిత్రమైన స్త్రీజన్మను అవమానపర్చే అందాల పోటీలను వ్యతిరేకించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ కోరారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన మేనకోడలు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి పదిమందికి సేవచేయాలనే సంకల్పంతో స్వయం ఉపాధిని ఎన్నుకోవడం సంతోషంగా ఉన్నదని అన్నారు. నిజంగా స్త్రీజాతిపై గౌరవం ఉంటే వారు స్వయంశక్తితో బతకడానికి స్వేచ్ఛ, ప్రోత్సాహం అందించాలని కోరారు.

డోబ్రియాల్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న సువర్ణ

అటవీ సంరక్షణ అధికారిగా సువర్ణ

పదవీ విరమణ చేసిన ఆర్ఎం డోబ్రియాల్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన సంరక్షణాధికారిగా డాక్టర్ సీ సువర్ణ బాధ్యతలు స్వీకరించారు. 1991 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సువర్ణ ఉమ్మడి ఏపీతో పాటు తెలంగాణలో వివిధ హోదాల్లో పనిచేశారు. అటవీశాఖ ప్రధాన సంరక్షణాధికారి ఆర్ఎం డోబ్రియాల్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సువర్ణను అటవీశాఖ ప్రధాన సంరక్షణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. సువర్ణ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పెద్దమ్మ క్లారిటీకి హ్యాట్సాఫ్!

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ పోరాటంలో కేసీఆర్ చూపిన తెగువను, పోరాట పటిమను సోషల్ మీడియాలో ఓ పెద్దమ్మ వివరించిన వీడియోపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'మొన్న ఈ పెద్దమ్మ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో మస్తు వైరల్ అయినయి! పదవుల కోసం పెదవులు మూసుకునే రాజకీయ నాయకులున్న రోజుల్లో.. ఉన్న పదవులన్నీ వదులుకుని, ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ కోసం కొట్లాడింది ఎవరో ఈ పెద్దమ్మ మాటల్లో స్పష్టంగా అర్థమవుతుంది. మీ క్లారిటీకి హ్యాట్సాఫ్! కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ఎంత చిత్తశుద్ధితో, నిబద్ధతతో నడిపారో.. వారి సారథ్యంలో సబ్బండ వర్ణాల ప్రజలు ఉద్యమంలో ఎలా పాల్గొన్నారో గుర్తుచేసిన ఈ ఉద్యమకారిణికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం

బసవన్న జయంతి సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): 12వ శతాబ్దంలోనే సామాజిక న్యాయానికి, విప్లవానికి బీజం వేసిన మహనీయుడు బసవేశ్వరుడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ సంప్రదాయ వ్యవస్థాపకుడు, సమానత్వం, కరుణల బోధకుడు బసవేశ్వరుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేహమే దేవాలయమని, శ్రమను మించిన దైవం లేదన్న బసవేశ్వరుడు కుల వ్యవస్థను, వర్ణ బేధాలను, లింగ వివక్షను వ్యతిరేకించారని తెలిపారు. బసవేశ్వరుడి బోధనలు నీతి, నిజాయతీ, సమాజంలో అందరికీ సమాన అవకాశాల కోసం పోరాడే స్ఫూర్తిని ఇస్తాయని పేర్కొన్నారు. బసవ జయంతి సందర్భంగా, ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టి, సమసమాజ నిర్మాణానికి కృషి చేద్దామని కేటీఆర్ ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

కర్రెగుట్టల్లో బాంబుల మోత

- భద్రతా దళాల గుప్పిట్లో అటవీ పరిసర ప్రాంతాలు
- రంగంలోకి ఐబీ చీఫ్ తపన్ దేకా?
- గుట్టపై జాతీయ జెండాలు ఎగరేసిన భద్రతా దళాలు
- కగార్‌ను నిలిపివేయాలని పలు గిరిజన సంఘాల డిమాండ్
- కొన్ని రోజులుగా బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్న అడవి బిడ్డలు

ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ, దళిత, గిరిజన సంఘాల నాయకులు

ములుగు, ఏప్రిల్ 30 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులకు ఆనుకొని ఉన్న కర్రెగుట్టలో కొనసాగుతున్న కేంద్ర బలగాల కూంబింగ్‌లో భాగంగా బాంబుల శబ్దాలతో అడవి దద్దరిల్లుతున్నట్టు తెలుస్తున్నది. మావోయిస్టుల ఆచూకీ కోసం బలగాలు చేపడుతున్న తనిఖీల్లో.. మావోయిస్టులు అమర్చిన బాంబులను నిర్వీర్యం చేసే క్రమంలో పేలుతున్నాయా? లేదా బలగాలకు మావోయిస్టులు తారసపడితే బాంబులు వేస్తున్నారా? లేదా మావోయిస్టులే బలగాల పైకి విసురుతున్నారా? అనేది తెలియడం లేదు. అయితే నడిపల్లి, పూజారీ కాంకేర్ ప్రాంతాలు మంగళవారం బాంబుల శబ్దాలతో హోరెత్తినట్టు తెలిసింది. పోలీసులు తమను బయటకు రావద్దని ఆంక్షలు విధించారని స్థానికులు చెప్తున్నారు. 11 రోజులుగా ముమ్మర గాలింపు కొనసాగుతున్నా ఇంకా తెరపడటం లేదు. మావోయిస్టులు మృతి చెందారని ఇటీవల వచ్చిన వార్తల్లో, పుకార్లలో వాస్తవం లేదని తెలుస్తున్నది. ఈ విషయాలపై ఇప్పటి వరకు పోలీస్ బలగాలు అధికార ప్రకటన చేయకపోవడంతోపాటు ధ్రువీకరించలేదు. సుమారు 250 కిలోమీటర్ల మేర అడవులు విస్తరించి ఉండటంతో కర్రెగుట్టపైకి వెళ్తున్న బలగాలు అస్వస్థతకు గురైన క్రమంలో వారిని హెలికాప్టర్ల సహాయంతో బీజాపూర్ దవాఖానకు తరలిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే కూంబింగ్‌లో అలసిపోయిన జవాన్లను రిఫ్రెష్ నిమిత్తం కిందకు తరలించి వారి స్థానంలో మరో టీమ్‌ను కూంబింగ్ కోసం పంపిస్తున్నట్టు సమాచారం.

రంగంలోకి దిగిన ఐబీ చీఫ్?

మావోయిస్టులను మట్టుపెట్టేందుకు సాగుతున్న కూంబింగ్‌ను భద్రతా బలగాలు సవాల్‌గా తీసుకున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే పర్యవేక్షణ నిమిత్తం ఐబీ చీఫ్ (ఇంటెలిజన్స్ బ్యూరో) తపన్ దేకా బుధవారం రంగంలోకి దిగినట్టు సమాచారం. రాయ్‌పూర్‌లో ఆపరేషన్‌పై అధికారులతో కీలక సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. మావోయిస్టుల ఆచూకీ కోసం ఉపగ్రహ ఛాయాచిత్రాలు, డ్రోన్‌ల సాయంతో బలగాల గాలింపు చేపడుతున్నట్టు సమాచారం. కర్రెగుట్టల సరిహద్దు ప్రాంతాలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న భద్రతా బలగాలకు మావోయిస్టులు ఏ క్షణంలోనైనా తారసపడొచ్చనే ఆలోచనతో కంటి మీద కనుకు లేకుండా కాపు కాస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగా కర్రె గుట్టలను పూర్తిగా భద్రతా దళాలు తమ గుప్పిట్లోకి తీసుకొని గుట్టపై జాతీయ జెండా ఎగురవేసినట్టు సమాచారం. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

తెరపడని యుద్ధ వాతావరణం

కర్రెగుట్టల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య అలుముకున్న యుద్ధ వాతావరణానికి తెరపడటం లేదు. ఇదిలావుండగా 5వ షెడ్యూల్ మైదాన ప్రాంతంలో పూర్తి హక్కులు ఆదివాసీలకే ఉన్నాయని, అటవీ ప్రాంతంలో బలగాలు మోహరించడం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని ఆదివాసీ, దళిత, గిరిజన సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి బలగాలను వెనక్కి రప్పించాలని, రక్తపాతం జరగకుండా చూడాలని గగ్గోలు చేస్తున్నాయి. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలో ఉన్న కర్రెగుట్టల చుట్టుపక్కల ఆదివాసీ గూడేల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. రాత్రింబవళ్లు జరుగుతున్న కూంబింగ్‌తో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

మంత్రి, కలెక్టర్‌కు వినతి

ములుగురూరల్, ఏప్రిల్ 30 : ఆపరేషన్ కగార్ పేరుతో కర్రెగుట్టల్లో జరుగుతున్న కేంద్ర బలగాల కూంబింగ్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆదివాసీ, దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ములుగు కలెక్టరేట్‌ను ముట్టడించారు. వారు లోనికి వెళ్లకుండా పోలీసులు గేటు మూసివేయడంతో అక్కడే బైఠాయించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ దివాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని మంత్రి సీతక్కను కలిసి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసేందుకు కృషి చేయాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కేంద్రానికి లేఖ రాస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం ఆ యా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ ప్రాంతంలో మావోయిస్టుల గాలింపు చర్యల నిమిత్తం కగార్ పేరుతో సైనిక చర్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కారణంగా ఆదివాసీలు అనేక కష్టాలను అనుభవిస్తున్నారని, పోలీసుల భయంతో అనేక గూడేలు లోతట్టు ప్రాంతాలకు వలస పోయినట్టు తెలిపారు. ఈ నిరసనలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమనాల లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్‌కుమార్, గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్, శాంతి చర్చల కమిటీ సభ్యుడు సోమ రామ్మూర్తి, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు మంజాల భిక్షపతిగౌడ్, ట్రైబల్ డెమోక్రాటిక్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణారావు

సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కే రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం సచివాలయంలో శాంతికుమారి నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలువురు అధికారులు నూతన సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 11, 2023న సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన శాంతికుమారి బుధవారం పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో రామకృష్ణరావును నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. రామకృష్ణారావు ఈ ఏడాది ఆగస్టు చివర్లో పదవీ విరమణ చేయనున్నారు.

సీఎం ముఖ్య కార్యదర్శిగా ఆంధ్రా రిటైర్డ్ అధికారి..

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజును సీఎం ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇతను రాష్ట్ర విభజన సందర్భంగా జరిగిన ఐఏఎస్ అధికారుల కేటాయింపులో భాగంగా ఏపీకి కేటాయించారు. కాగా, ఆయన ఇక్కడే ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగారు. పదవీ విరమణ తరువాత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్రు ఆయన్ను ప్రభుత్వ సలహాదారుగా నియమించగా, తాజాగా సీఎం ముఖ్య కార్యదర్శిగా నియమించారు.

ఢిల్లీ తెలంగాణ భవన్‌కు శశాంక్ గోయల్..

సీజీజీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్‌ను ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రెండ్రోజుల క్రితమే ఆయన సీజీజీ డైరెక్టర్ జనరల్ గా బదిలీ కాగా, తాజాగా ఆయన్ను ఢిల్లీకి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఏపీలో రెండు ప్రమాదాలు.. 13 మంది దుర్మరణం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఏపీలో బుధవారం జరిగిన రెండు దుర్ఘటనల్లో 13 మంది చనిపోయారు. సింహాద్రి అప్పన్న ఆలయంలో గోడకూలి ఏడుగురు భక్తులు మృతి చెందారు. విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో చందనోత్సవంలో స్వామి వారి నిజరూపాన్ని దర్శించేందుకు భక్తులు రూ.300 టికెట్ క్యూలెన్లో నిల్చున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా సిమెంట్ గోడ కూలి భక్తులపై పడింది. ఈ విషాద ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

దూసుకెళ్లిన కారు.. ఆరుగురు మృతి

నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వైద్య విద్యార్థులు సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వీరంతా బుచ్చిరెడ్డిపాలెంలో తమ స్నేహితుడి అక్క పెళ్లినిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా పోతిరెడ్డిపాలెం రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగింది. కారులోని ఐదుగురు విద్యార్థులు మరణించగా ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య(50) దుర్మరణం చెందాడు.



ఏలూరి శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఉద్యాన అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగాయి. తొలిసారిగా జరిగిన ఈ ఎన్నికల్లో 155మంది ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పీ శ్రీరామ్‌రెడ్డి వ్యవహరించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జీ సందీప్‌కుమార్, కార్యదర్శిగా రావుల చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ అనంతరెడ్డి, కార్యదర్శిగా జీ జలేందర్ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా యు కమల, సీహెచ్ రాకేశ్, అనితాశ్రీ, కన్నా జగన్, బీ రాజు, ఏ అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా పీ హిమబిందు, ఏ సునీల్‌కుమార్, బీ మహేందర్, ప్రచార కార్యదర్శిగా రుద్ర వినాయక్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీజీవో నేతలు ఏలూరి శ్రీనివాస్‌రావు, సత్యనారాయణను కలిశారు.

ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు అనుమతి కోరిన డిస్కంలు

టీజీ ఈఆర్సీ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్‌లో (ఆర్డీఎస్ఎస్) చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరినట్టు డిస్కంలు తెలిపాయని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) వెల్లడించింది. ఇదే విషయాన్ని రిటైల్ సప్లయ్ బిజినెస్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌లో డిస్కంలు ప్రస్తావించినట్టు ఈఆర్సీ కార్యదర్శి బుధవారం ప్రకటించారు. తెలంగాణ డిస్కంలు ఆర్డీఎస్ఎస్‌లో చేరుతున్నాయని, ఆ విషయాన్ని ఈఆర్సీ చైర్మన్ ధ్రువీకరించారని వార్తలు రావడంతో విద్యుత్తు నియంత్రణమండలి పై విధంగా స్పందించింది.

ఇంకా డీపీఆర్ సమర్పించలేదు: ఎస్పీడీసీఎల్

ఆర్‌డీఎస్ఎస్‌లో చేరేందుకు తాము ఎలాంటి చర్యలు తీసుకోలేదని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ స్పష్టం చేసింది. ఈ స్కీమ్‌లో చేరేందుకు డిస్ట్రిబ్యూషన్ రిఫార్మ్స్ కమిటీ (డీఆర్‌సీ) ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖకు డీపీఆర్‌ను సమర్పించాల్సి ఉంటుందని, ఆ డీపీఆర్‌ను తామింకా సమర్పించలేదని టీజీఎస్పీడీసీఎల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సెల్ చీఫ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

పదిలోనూ బాలికలే టాప్

- బాలికలు 94.26%, బాలురు 91.32% ఉత్తీర్ణత
- మొత్తంగా 92.78% పాస్.. గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత
- పదో తరగతి ఫలితాల్లో సీఎం సొంత జిల్లా లాస్ట్
- 33వ స్థానానికి పరిమితమైన వికారాబాద్ జిల్లా
- 99.29శాతంతో మహబూబాబాద్ జిల్లా టాప్
- రెండు ప్రైవేట్ స్కూళ్లల్లో జీరో శాతం ఉత్తీర్ణత
- జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

రెగ్యులర్ విద్యార్థుల ఉత్తీర్ణత వివరాలు

ఉత్తీర్ణత శాతం	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణతశాతం
బాలురు	2,50,345	2,28,608	91.32
బాలికలు	2,46,029	2,31,911	94.26
మొత్తం	4,96,374	4,60,519	92.78

టాపర్లు వీరే →

పేరు	జిల్లా	మార్కులు
నిమ్మ అంచిత	కామారెడ్డి	596
సిర్ప కృతి	నిజామాబాద్	596
సముద్రాల అద్వైత	రంగారెడ్డి	595
శ్రీపది సాయి సృజన	సూర్యాపేట	595
గండు జోషిత	హైదరాబాద్	595
గట్టుపల్లి శ్రీజ	రంగారెడ్డి	594
ఏ శ్రీమ రెడ్డి	మేడ్చల్ –మల్కాజిగిరి	594
ఎస్ ఆయుష్ ఇన్నాని	హైదరాబాద్	594
మొహమ్మద్ వసీం ఖ్వాజా	రంగారెడ్డి	594
వీరన్నగారి రాజశ్రీ	హైదరాబాద్	594

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): పదోతరగతి పరీక్ష ఫలితాల్లోనూ బాలికలే సత్తా చాటారు. బాలికలు 94.26 శాతంతో ప్రతిభ కనబరచగా, బాలురు 91.32% ఉత్తీర్ణులయ్యారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో మొత్తంగా 92.78% ఉత్తీర్ణత నమోదయ్యింది. నిరుడు 91.31% విద్యార్థులు ఉత్తీర్ణులవగా ఈ సారి 1.47% ఉత్తీర్ణత పెరిగింది. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను బుధవారం రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. మహబూబాబాద్ జిల్లా 99.29శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. సంగారెడ్డి 99.09శాతంతో రెండోస్థానంలో, జనగామ 98.91శాతంతో మూడోస్థానంలో నిలిచింది. జిల్లా పరిషత్ స్కూళ్లల్లో 89.13%, ప్రభుత్వ పాఠశాలల్లో 84.83%, ఎయిడెడ్‌లో 90.65% విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ బడుల్లో 94.21% ఉత్తీర్ణత నమోదయ్యింది. ఈసారి పదో తరగతి మెమోలపై మార్కులతోపాటు గ్రేడ్లను సైతం ముద్రించారు. ఇంటర్నల్ మార్కులు, థియరీ పరీక్షల్లో వచ్చిన మార్కులను కలిపి మొత్తం మార్కులు వేశారు. సీజీపీఏ గ్రేడ్లను సైతం కేటాయించారు. జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు ఈ నెల 16లోపు ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

సీఎం జిల్లా లాస్ట్..

పదో తరగతి ఫలితాల్లో వికారాబాద్ జిల్లా అతి తక్కువ ఉత్తీర్ణతశాతంతో చివరిస్థానంలో నిలిచింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్‌తోపాటు నారాయణపేట జిల్లాల కిందికి వస్తుంది. వికారాబాద్ 73.97% ఉత్తీర్ణతతో 33వ స్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా 95.18% ఉత్తీర్ణతతో 19వ స్థానంలో నిలిచింది. మొత్తంగా దివ్యాంగులు 1,306 మంది పరీక్షలు రాయగా, 1,222 (93.57%) మంది ఉత్తీర్ణత సాధించారు. మిగతా పాఠశాలల కంటే గురుకులాలు ఉత్తమ ప్రదర్శన కనబరిచాయి. తెలంగాణ రెసిడెన్షియల్ 98.79%, బీసీ 97.79%, సోషల్ వెల్ఫేర్ 97.71%, గిరిజన 97.63%, మైనార్టీ 96.57% ఉత్తీర్ణత నమోదుచేశాయి. మొత్తంగా 11,554 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయగా, 4,629 పాఠశాల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. రెండు పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత నమోదుకాగా, ఈ రెండు ప్రైవేట్ స్కూళ్లే కావడం గమనార్హం.

టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): టెన్త్ ఫలితాల్లో 594 అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్టు శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. 593కి పైగా మార్కులను ముగ్గురు, 580కి పైగా 374 మంది, 550కి పైగా 3,969 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ఇంగ్లిష్‌లో 10,866 మంది 'ఏ' గ్రేడ్, సోషల్‌లో 10,320 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్, సెకండ్ లాంగ్వేజ్‌లో 10,158 మంది 'ఏ' గ్రేడ్, సైన్స్‌లో 9,983 మంది 'ఏ' గ్రేడ్, మ్యాథ్స్‌లో 9,898 మంది 'ఏ' గ్రేడ్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో 9,786 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్ పొందినట్టు వెల్లడించారు. మొత్తంగా 11,428 మంది విద్యార్థులకుగాను శ్రీ చైతన్య స్కూల్ సగటున 600 మార్కులకు 531, ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.3%, అత్యధిక బ్రాంచ్‌లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించినట్టు ఆమె తెలిపారు. విద్యార్థులను శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్లు సీమ, నాగేంద్ర అభినందించారు.

నారాయణ స్కూల్స్ విజయశంఖారావం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి ఫలితాల్లో నారాయణ స్కూల్స్ విద్యార్థులు విజయశంఖారావం మోగించారు. శ్రీమారెడ్డి 594 మార్కులతో స్టేట్ టాప్ ర్యాంకుతో చరిత్ర సృష్టించింది. 593, 592, 590కి పైగా మార్కులను 22 మంది విద్యార్థులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పీ సింధూర, పీ శరణి, కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ తెలిపారు. మ్యాథ్స్‌లో 5,909 మంది 'ఏ' గ్రేడ్, సైన్స్‌లో 5,702 మంది ఏ' గ్రేడ్, సోషల్‌లో 6,485 మంది ఏ' గ్రేడ్, ఇంగ్లిష్‌లో 7,124 మంది ఏ' గ్రేడ్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో 5,789 మంది ఏ' గ్రేడ్, సెకండ్ లాంగ్వేజ్‌లో 5,867 మంది ఏ' గ్రేడ్, మొత్తంగా 36,876 మంది ఏ' గ్రేడ్ సాధించినట్టు పేర్కొన్నారు. తెలంగాణలో సగటున 517 మార్కులు సాధించిన ఏకైక విద్యా సంస్థ నారాయణ మాత్రమే అని వెల్లడించారు. 66బ్రాంచీల్లో 100% పాస్ పర్సంటేజ్ సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే పునీత్, డైరెక్టర్లు అభినందించారు.

పది ఫలితాల్లో అల్ఫోర్స్ అగ్రగామి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో అల్ఫోర్స్